ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

సోమవారం 9 డిసెంబరు 2024

న్యూస్ బాక్స్

గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుండె వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండె వ్యాధి నిపుణులు దీక్షిత్ అన్నారు. ఆదివారం గోదావరిఖని విఠల్‌నగర్‌లో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వ్యాధి శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై రోగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్యం పెరగడంతో గుండె వ్యాధులు పెరిగాయని, ఏడాదికి ఒకసారి పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఉచితంగా ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మెడికవర్ హెడ్ గుర్రం కిరణ్, మేనేజర్, కోట కరుణాకర్, తిరుపతి, పోషం, హరీష్, యూనిస్ పాల్గొన్నారు.

13న గోదావరిఖని నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా ఈనెల 13న గోదావరిఖని ఆర్‌టీసీ డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలంకు ప్రత్యేక బస్సును నడుపనున్నట్లు డిపో మేనేజర్ నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు సౌకర్యాన్ని గోదావరిఖని, పెద్దపల్లి, మంథని ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలని ఒక్కొక్కరికి చార్జి రూ.4850 నిర్ధయించినట్లు తెలిపారు. టికెట్‌బుకింగ్ కోసం 7382847316, 7382847427 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అయ్యప్ప పడిపూజ

ఫైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాలనీ పరిధి అల్లూరులో శనివారంరాత్రి అయ్యప్ప పడిపూజా మహోత్సవం కన్నులపండువగా జరిగింది. అయ్యప్ప విగ్రహానికి ఫలపంచామృత అభిషేకాలు, అమ్మవారి కుంకుమ పూజ నిర్వహించారు. పడిపూజలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, శైలజ దంపతులు పాల్గొన్నారు. కార్పొరేటర్ శంకర్ నాయక్, మాజీ కార్పొరేటర్ స్టాలిన్, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ మాఫియా

- పీడీ యాక్టు హెచ్చరికలను ఖాతరు చేయని వైనం
- పట్టుబడితే డ్రైవర్లపైనే కేసులు నమోదు..
- ప్రతినెలా 2వేల టన్నులపైనే అక్రమ రవాణా
- అక్రమ దందాపై సివిల్ సప్లై కమిషనర్ సీరియస్



గోడౌన్ నుంచి స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం(ఫైల్)

కోల్‌సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. రేషన్ స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామని రామగుండం పోలీస్ కమిషనరేట్ హెచ్చరికలను సైతం ఖాతరు చేయడం లేదు. దీంతో పోలీసుల సహకారంపైనే విమర్శలు వెల్లువెత్తుతు న్నా యి. ఎప్పుడు రేషన్ బియ్యం పట్టుబడినా డ్రైవర్లపై కేసులు నమోదు చేసి పంపడం సాధారణం అయ్యింది. రేషన్ స్మగ్లర్ల పేర్లు ఎక్కడా కూడా కనీసం ఎఫ్ఐఆర్‌లోకి రావడంలోకి రావడం లేదు. వారిపై కేసులు నమోదు కూడా చేసిన పరిస్థితి కూడా లేదు. దీంతో జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా నిర్విరామంగా కొనసా గుతోంది.

స్మగ్లర్లపై కేసులే లేవు...

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఇటు సివిల్ సప్లై, పోలీసులు పెద్దగా దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. దీర్ఘకాలంగా సివిల్‌సప్లై విభాగం రేషన్ మాఫియాకు సహకరిస్తుందనేది బహిరంగ రహస్యం. పోలీసుల నుంచి కూడా అదే స్థాయిలో సహకారం అందుతున్నట్లు ఇంటలీజెన్స్ సైతం నివేదికలు ప్రభుత్వానికి పంపింది. సేకరణ మొదలు రాష్ట్ర సరిహద్దు దాటే వరకు ఉన్న ఠాణాలతో స్మగ్లర్లకు సత్సంబంధాలు ఉన్నట్లు పోలీస్ శాఖలోనే చర్చ జరుగుతోంది. ఠాణాల నెలవారీ మామూళ్లలో రేషన్ దందాలు కూడా చేరిపోయినట్లు తెలుస్తోంది. ఎక్కడ రేషన్ బియ్యం పట్టుకున్నా వాహనాల డ్రైవర్లపై మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు.

జిల్లా నుంచి మహారాష్ట్రకు...

జిల్లాలో 416రేషన్ షాపులు ఉండగా ప్రతి నెల 3వేల నుంచి 3500టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుంది. ఇందులో సుమారు 2వేల నుంచి 2500టన్నులు స్మగ్లర్ల చేతుల్లోకి పోతోంది. మొదట రైస్ మిల్లులకు రీసైక్లింగ్‌కు రేషన్ బియ్యం అమ్మగా ఇప్పుడు లిక్కర్ ఫ్యాక్టరీలకు, కోళ్ల ఫారాలకు అమ్ముతున్నారు. జిల్లాలో ముఖ్యంగా ముగ్గురు స్మగ్లర్లు మంథని, పెద్దపల్లి, రామగుండం ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి మహా రాష్ట్రకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి మహారాష్ట్ర,



బియ్యం అక్రమ రవాణా చేస్తూ దొరికిన ట్రక్కు(ఫైల్)

మధ్యప్రదేశ్, తమిళనాడులోని లిక్కర్ పరిశ్రమలకు, కోళ్ల దానా పరిశ్రమలకు విక్రయాలు జరుపుతున్నారు. కొంత కాలంగా డీలర్ల ద్వారా కృష్ణపట్నం, కాకినాడ రేవులకు తరలించి అక్కడి నుంచి విదేశాలకు సైతం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

ట్రక్కులు, వ్యాన్‌లతో టన్నుల కొద్ది బియ్యం దొరుకుతున్నా రేషన్ బియ్యం దందా చేసే వారి పేర్లు మాత్రం పోలీస్ రికార్డులకు ఎక్కడం లేదు. దందాకు పాల్పడే వారు వాహనాలను కూడా దళిత బంధు లబ్ధిదారుల నుంచి తీసుకున్నవి, తమ వద్ద పని చేసే సిబ్బంది పేర తీసుకున్నవి మాత్రమే వినియోగిస్తున్నారు.

పగలే రావాణా...

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రేషన్ కింగ్‌పిన్‌గా పేరున్న ఒక స్క్రాప్ దందా నిర్వాహకుడు పగలే దర్జాగా రవాణా చేస్తున్నట్టు పోలీస్ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. ఇటీవల సివిల్ సప్లై స్టేట్ టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించగా పగటిపూటే సంబంధిత స్మగ్లర్ల వాహనాలు పట్టుబడ్డాయి. ఇది రామగుండం స్పెషల్ అంటూ సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు పేర్కొంటున్న పరిస్థితి. స్మగ్లర్లకు సంబంధించిన వాహనాలు గోడౌన్ల నుంచి బయలుదేరి రాష్ట్ర సరిహద్దులు దాటే వరకు తనిఖీలు ఉండవనే ప్రచారం ఉంది. ఒక స్మగ్లర్‌కు చెందిన వాహనాన్ని మంచిర్యాల జిల్లాలో పట్టుకుంటే స్మగ్లర్ల ఒత్తిడితో డ్రైవర్లు వాహనాలకు సంబంధించిన పేపర్లు చూపించలేదనే పెనాల్టీ వేసి పంపినట్టు తెలుస్తోంది.

సివిల్ సప్లై కమిషనర్ సీరియస్

ఆంధ్రా, తెలంగాణల నుంచి రేషన్ బియ్యం విదేశాలకు అక్రమ రవాణా అవుతోందనే సమాచారం మేరకు సివిల్ సప్లై విభాగం అప్రమత్తమైంది. ఇటీవల మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో పర్యటించిన కమిషనర్, అదనపు డీజీపీ డీహెచ్ చౌహాన్ అక్రమ దందా వ్యవహారాలపై సీరియస్ అయినట్టు సమచారం. శాఖల సహకారం లేకుండా బియ్యం తరలింపు సాధ్యం కాదని, దందా ఆగాలని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. దీంతో జిల్లాలో సివిల్ సప్లై అధికారులు, పోలీస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు వారం రోజులుగా తనిఖీలు జరుపుతున్నారు. గోదావరిఖని పట్టణంలో సివిల్ సప్లై 5 టన్నుల బియ్యం పట్టుకోగా గోదావరి వంతెన వద్ద కమిషనరేట్

మిగతా 8వ పేజీలో..



నీరుకుల్ల వంతెనకు మోక్షమెప్పుడో?

- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం

6

ప్రారంభోత్సవానికి నోచుకోని నీరుకుల్ల వంతెన



టీ-ఫైబర్ ద్వారా ఇంటింటికి ఇంటర్నెట్ సేవలు

- యాప్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

6

యాప్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 26,27,28 వార్డుల్లో ప్యాకేజీ 9 ద్వారా టీయూఎఫ్ఐడీసీ నిధులు కోటి 31లక్షల 97వేల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపన చేశారు. ఇందులో సీసీ రోడ్లు డ్రైనేజీ, కల్వర్టల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపే విధంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతామన్నారు. రానున్న రోజుల్లో ప్రతి వార్డులో సమస్యలు లేకుండా చూస్తామన్నారు. మౌళిక వసతుల కల్పనలో ఎలాంటి జ్యాప్యం ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో సిమ్స్ విద్యార్థుల ప్రతిభ



జాతీయ సదస్సులో పాల్గొన్న సిమ్స్ విద్యార్థులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చండీఘర్‌లో ఈనెల 4 నుంచి 7వ తేదీవరకు నిర్వహించిన 50వ జాతీయ బయోకెమిస్ట్రీ సదస్సులో సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రెండవ సంవత్సరం విద్యార్థులు రిషిరావు, హర్షవర్ధన్, సాత్విక్, అభిరామ్, సుదీప్, అన్షు ప్రతిభను చాటారు. న్యూరో బయో కెమిస్ట్రీ విటమిన్ డీ హెవీ మెంటల్ టాక్సిసిటీపై చేసిన పరిశోధనలో పాల్గొని జాతీయ స్థాయిలో నిలిచారు. అంతర్జాతీయ, జాతీయ శాస్త్రవేత్తలు, నిపుణుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో విద్యార్థులు మొదటి స్థాయిలో నిలిచారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌వర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిభను సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

పూలే, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలే ఆశయాలను నేటి యువతరం కొనసాగించాలని రిటైర్డ్ ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ బి.రాజయ్య, ప్రైవేట్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు ఆర్నకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖనిలో పూలే, అంబేద్కర్ జ్ఞాన మాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. దళిత, అనగారిన వర్గాలు సామాజికంగా ఆర్థికంగా, సాంస్కృతికంగా చైతన్యవంతులు కావడం కోసం పూలే, అంబేద్కర్ జ్ఞానమాల ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బొంకూరి మధు, కొంకటి లక్ష్మణ్, కాంపెల్లి సతీష్, ఇరుగురాళ్ల కిష్టయ్య, శనిగరపు రామస్వామి, ఆకూనూరి బాల అంకూష్, శశిభూషణ్, బూడిద మహేందర్, పెరిక రవి, శనిగరపు చంద్రశేఖర్, రవికుమార్, ఈదునూరి రాజేశ్వర్, నవాబ్, రామగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా మల్లికార్జునస్వామి శోభాయాత్ర



స్వామివారికి మొక్కలు చెల్లించుకుంటున్న భక్తులు

కమాన్‌పూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూలపల్లిలో పర్వతాల మల్లికార్జున స్వామి శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతిఏడాది షష్టి వారాల్లో భాగంగా మల్లికార్జునస్వామి శోభాయాత్ర ఎలబోయిన వంశీయుల ఆధ్వర్యంలో జరుగుతోంది. వేడుకల్లో భాగంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు, మహిళల కోలాట నృత్యాల నడుమ కన్నుల పండువగా శోభాయాత్ర కొనసాగింది. అనంతరం స్వామివారి ఉత్సవవిగ్రహాలను ఆలయంలో పునఃప్రతిష్ఠించారు. ఈ వేడుకలో కాంగ్రెస్ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు, పెద్దపల్లి గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయ దంపతుల ఆదర్శం..

ఫైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరణానంతరం శరీర దానానికి అంగీకారం తెలిపి రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు నేదునూరి కనకయ్య ఆదర్శవంతంగా నిలిచారు. గుర్రంపల్లి ప్రాథమిక పాఠశాల పనిచేసిన నేదునూరి కనకయ్య గత నెలాఖరున రిటైర్ అయ్యారు. ఈసందర్భంగా మరణానంతరం తన సతీమణితోపాటు శరీరదానానికి అంగీకారం తెలుపుతూ సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు ఆదివారం పత్రాలను అందజేశారు.

యువత జీవితంలో పోటీతత్వంతో ఎదగాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ యువత పోటీ తత్వంతో జీవితంలో ఎదగాలని ప్రభుత్వవిప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని కమ్మరిఖాన్‌పేట యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ యువకులు క్రీడల ద్వారా నేర్చుకున్న సమయస్ఫూర్తిని జీవితంలో అన్వయించుకొని ముందుకు సాగాలని సూచించారు. గ్రామ యూత్‌లు మొక్కుబడిగా కాకుండా వాటి ద్వారా ప్రజా సేవ చేయడం నేర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు కాడే సూర్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి, సోగాల తిరుపతి, అశ్రఫ్ ఆలీ, గుజ్జేటి రాజు, కాదాసి నవీన్, తాడ్వాయి ప్రవీణ్, చారీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి..

- రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ అనీల్ కుమార్

మార్కండేయకాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని మేయర్ బంగి అనీల్ కుమార్ అన్నారు. ఆదివారం పీజీ కాలేజీ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తండ్రి కిషన్‌సింగ్ ఠాకూర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శరీర దారుడ్యాన్ని పెంపొదిస్తాయని చెప్పారు. ప్రతిఒక్కరు చిన్న నాటి నుంచే క్రీడలను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, తిప్పారపు శ్రీనివాస్, దూళికట్ట సతీష్, కొక్కిరాల శ్రీనివాస్‌తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆరోపణలకు అభివృద్ధితోనే సమాధానం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



నాలా ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామగుండం అభివృద్ధిపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలకు తాను చేసే అభివృద్ధే సమాధానమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. విపక్షాలకు కళ్లు ఉంటే అభివృద్ధి పనుల వైపు చూడాలని ఆయన సూచించారు. ఆదివారం రామగుండం నగరపాలక సంస్థ 38వ డివిజన్ ఇందిరానగర్‌లో టీయూఎఫ్ఐడీసీ రూ.75 లక్షల నిధులతో జరుగుతున్న నాలా ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. తాను ఎన్నికల ప్రచారంలో ఇందిరానగర్‌కు వచ్చిన సందర్భంలో ప్రజలు నాలా వల్ల ఇబ్బందుల గురించి వివరించారన్నారు. ఒక బాలిక తనను ప్రశ్నించిందని కూడా పేర్కొన్నారు. ఇందిరానగర్ నుంచే ఈ ప్రారంభమై మార్కండేయకాలనీ, మెడికల్ కళాశాల, సప్తగిరి కాలనీ మీదుగా గోదావరి వరకు ఉంటుందన్నారు. ఈ నాలా మొత్తాన్ని ఆధునికీకరించాలని నిధులు కేటాయించామన్నారు. రెండు ప్యాకేజీల్లో పనులు కూడా జరుగుతున్నాయన్నారు. గత పాలకుల హయాంలో అభివృద్ధి అంటేనే తెలియని పరిస్థితి ఉందని, డ్రైనేజీలు లేక చెత్తా చెదారం కూరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, పట్టణంలోని ప్రధాన నాలాలను పటిష్ఠంగా కాంక్రీట్ బెడ్‌లతో ఆధునీకరిస్తున్నామన్నారు. ఏడాది కాలంలో రూ.500కోట్ల నిధులు సమీకరించుకున్నామని, ఇప్పుడు పనులు మొదలు పెట్టామన్నారు. రెండవ సంవత్సరంలో అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి రామగుండానికి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తే మంచి కాలనీలు ఏర్పడుతాయన్నారు. అన్ని రంగాల్లో రామగుండాన్ని అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. 25ఏళ్లలో గత పాలకులు చేయలేని అభివృద్ధిని, మార్పును ఆరు నెలల్లో చేసి చూపించానని రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు మేకల పోషం, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తాఫా, నాయకులు రాజిరెడ్డి, తిప్పారపు శ్రీనివాస్, సాంబమూర్తి, గడ్డం శ్రీనివాస్, తేజ ఉన్నారు.



రాజనర్సుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న మనాలీ ఠాకూర్

ఆటోడ్రైవర్ కుటుంబానికి చేయూత

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ కాలనీలో నివాసముండే రాజనర్సు ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తూ ఐదు నెలలుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ ఆదివారం బాధితుడికి రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆన్‌పాసివ్ సభ్యులు రాజనర్సు దుస్థితిని మనాలీ ఠాకూర్‌కు వివరించడంతో స్పందించి ఆమె ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వేముల మహేందర్, బాలయ్య, ప్రభాకర్, శ్రావణ్ కుమార్, శంకరయ్య, విఘ్నేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి : సీఐటీయూ

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్బగా ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కేటగిరీల వారిగా వేతనాలను పెంచాలని స్టేటస్ కల్పించాలని బకాయి వేతనాలు చెల్లింపులో జరుగుతున్న జాతీయపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. .వెంటనే ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ సంఘాల జేఏసీతో చర్చలు జరపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిపెల్లి రవీందర్,ఎండి ఖాజా, జిల్లా కమిటీ సభ్యులు తీట్ల శ్రీనివాస్, ఆకుల రాజయ్య, పైడిపల్లి నాగయ్య, అంబాల లక్ష్మణ్, ముస్తఫా, రెడ్డిమల్ల నాగేశ్వర్, రవికుమార్, మల్లయ్య, శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు..



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యంరావు

రుణ మాఫీలో కేంద్రం బాధ్యతలను విస్మరించడం తగదు

- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణ మాఫీ వ్యవహారంలో కేవలం రాష్ట్రానికే బాధ్యత ఉంటుందా.. కేంద్రానికి బాధ్యత లేదా అని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో రుణ మాఫీ వ్యవహారంలో కేంద్రమే బాధ్యత తీసుకుందని గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం రైతు రుణ మాఫీ బాధ్యతను విస్మరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రుణ మాఫీలో కేంద్రం తనవంతు పాత్రను పోషించాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కోరుతున్నానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో రాచరిక వ్యవస్థకు అద్దం పట్టేలా రూపొందించారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బి డ్డను పోలి ఉండేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారని వివరించారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న అనవసర విమర్శలు మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ సర్కారు అన్ని నియోజకవర్గాలలో రెసిడెన్షియల్ స్కూళ్లలో సొంత భవనాలు కట్టించే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు దుర్గయ్య, నక్క జీవన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

- సీఎంకు జీవన్‌రెడ్డి లేఖ..

తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేయనున్న 16 కృషి విజ్ఞాన కేంద్రాలలో భాగంగా జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జీవన్ రెడ్డి ఆదివారం లేఖ రాశారు. కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన యూనివర్సిటీ ఆధ్వర్యం లోని శాస్త్రవేత్తల బృందం జగిత్యాలలో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసినట్లు తెలిసిందన్నారు. జగిత్యాల పట్టణ శివారులోని చల్‌గల్‌లో గల వాలంతరీకి చెందిన భూమి సుమారు 50 ఎకరాలు అందుబాటులో ఉందని, కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నీరుకుల్ల వంతెనకు


మోక్షమెప్పుడో?



నీరుకుల్లలో మానేరు వాగుపై నిర్మించిన వంతెన

- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సుల్తానాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : లక్షల రూపాయల ఖర్చు చేసి నిర్మించిన వంతెనకు మోక్షం కలగడం లేదు. సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల మానేరు వాగుపై వంతెన నిర్మాణం పూర్తయి ఆరేళ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజల రవాణా సౌకర్యం మెరుగుపడుతుందనుకున్న వారి ఆశలన్నీ అడియాశలవుతున్నాయి. వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడం వలన వాహనాల రాకపోకలకు వీలు పడడం లేదు. వంతెన నుంచి కుడి వైపు వెళ్లినా, ఎడమ వైపు వెళ్లినా మధ్యలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలు వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారాయి. దీంతో వంతెన ఎప్పుడు ప్రారంభవుతుందా అని ఆశతో ఎదురు చూస్తున్నారు.



వంతెనకు కుడి వైపు భారీ వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న కోమాండ్లపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి

● కొలిక్కిరాని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

వంతెనను ఉపయోగంలోకి తేవడంలో పలు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఓవైపు అప్రోచ్ రోడ్డు లేకపోవం, మరోవైపు రెండు వైపులా రైల్వే అండర్ బ్రిడ్జిలు అడ్డుగా ఉన్నాయి. వంతెన నుంచి కుడి, ఎడమ వైపు ఉన్న లోలెవల్ రైల్వే అండర్ బ్రిడ్జిల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉంది. లేదా ప్రస్తుత వంతెన నుంచి రైలు మార్గంపై నుంచి నీరుకుళ్ల-గర్రెపల్లి రోడ్డుపై వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం అయినా చేపట్టాల్సి ఉంటుంది. ఈ ఫ్లైఓవర్ నిర్మించడానికి ప్రస్తుత వంతెనను ఇంకా ముందుకు కొనసాగించేందుకు హైటెన్షన్ విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయి. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ఆరేళ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అవి కొలిక్కి రావడంలేదు. వంతెన నుంచి రంగంపల్లి పెద్దమ్మ దేవాలయం వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం రూ.27 కోట్లతో అంచనాలు తయారుచేసినా ప్రధానంగా భూసేకరణ సమస్య పరిష్కారం కావడం లేదని తెలిసింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● వంతెనకు ప్రతిపాదనలు..

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల మానేరు వాగుపై వంతన నిర్మాణ ఆవశ్యకతను, ప్రయాణ వెసులుబాటును, తగ్గే ధూర భారం తదితర అంశాలను పరిగణనలోకి తీసు కొని ఆనాటి ఎమ్మెల్యేలు ప్రతిపా దనలు సిద్ధం చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో నాటి రోడ్లు, భవనాల శాఖ మంత్రి జీవన్‌రెడ్డికి సుల్తానా బాద్‌లో మినీ కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే గీట్ల ముకుంద రెడ్డి వంతెన అవశ్యకతపై విజ్ఞప్తి చేశారు. నిధులు మంజూ రైనా కానీ సకాలంలో పనులు చేపట్టకపోవడంతో వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చ లేదు. తెలంగాణ ఏర్పడ్డాక 2015లో సీఎం కేసీఆర్‌కు ఆనాటి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వంతెన నిర్మాణం గుర్తించి వినతి పత్రాన్ని సమర్పించారు. స్పందించిన సీఎం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

● తగ్గనున్న దూర భారం..

సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల వద్ద మానేరుపై వంతెనపై రాకపోకలు ప్రారంభమైతే ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రయాణీకులకు ఎంతో వెసులుబాటు కలగడంతో పాటు దూరభారం కూడా తగ్గనుంది. సుల్తానాబాద్ మండలం నీరకుల్ల మానకొండూరు మండలం వేగురపల్లి నుంచి నిత్యం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన మీదుగా వెళితే తమకు 30-35 కిలోమీటర్ల దూరభారం తుగ్గుతుందని, వంతెన పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● 2016లో శంకుస్థాపన..

తెలంగాణ ప్రభుత్వంలో అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, హరీష్‌రావు తదితరులతో పాటు పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో 12 జనవరి 2016న నీరుకుళ్ల వంతెన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. రెండేళ్లలోనే పనులు పూర్తిచేయించారు. తర్వాత రాకపోకలు సవ్యంగా సాగుతాయని అందరూ ఆశించారు. కానీ వంతెన నుంచి ఎడమ వైపు వెళితే కోమాండ్లపల్లి రోడ్డులో ఒక రైల్వే అండర్ బ్రిడ్జి, కుడి వైపు వెళ్లితే నీరుకుళ్ల గ్రామం వద్ద మరో రైల్వే అండర్ బ్రిడ్జి ఉంది. ఈ మార్గంలో ఉన్న రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలు చిన్నగా ఉండడంతో వాటి కింది నుంచి భారీ వాహనాలు లేని పరిస్థితి. దాంతో మానేరుపై నిర్మించిన వంతెన వల్ల ఉపయోగం లేకుండా పోతోంది. అధికారుల రైల్వే అండర్ బ్రిడ్జిలను పరిగణనలోకి తీసుకొని తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఉంటే వంతెన ఉపయోగంలోకి వచ్చి ఉండేది.

టీ-ఫైబర్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు

- ఇంటి నుంచే 150 రకాల పౌర సేవలందించేందుకు మీ సేవ యాప్ సిద్ధం - పైలట్ ప్రాజెక్టు కింద 3 గ్రామాల్లో సేవలు ప్రారంభం
- హైదరాబాద్‌లో యాప్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ముత్తారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలను టీ ఫైబర్ ద్వారా అందించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లో టీ-ఫైబర్ యాప్ ను పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో రాష్ట్రంలో 7592కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆజాద్ ఇంజనీరింగ్, ప్రీమియర్ ఎనర్జీస్, గ్లోబల్ ఎన్విరాన్ మెంట్, లెన్స్‌కార్ట్ సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజలకు అందించే టీ-ఫైబర్ యాప్ ద్వారా టెలిఫోన్, ఇంటర్నెట్, కేబుల్ టీవీ, కంప్యూటర్ వంటి అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని, వీటిని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యా ప్తంగా ముందస్తుగా 3పైలెట్ గ్రామాలను ఎంపిక చేసి టీ-ఫైబర్ యాప్, ఇం టింటికీ ఇంటర్నెట్ కనెక్షన్స్ సౌకర్యాలు కల్పించామన్నారు. ఇందులో నుంచి వచ్చే అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలు విస్తరి స్తామని అన్నారు. టీ-ఫైబర్ ప్రాజెక్టు ద్వారా మొదటి సంవత్సరం ప్రభుత్వ కార్యాలయాల కు బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ అందిస్తామని అన్నారు. మీ సేవా ద్వారా 150 రకాల పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా మొబైల్ యాప్ సిద్ధం చేయడంతో పాటు రద్దీ ప్రాంతాల్లో క్యూఎస్కేలను ఏర్పాటు చేయనుందని అన్నారు. షాపింగ్‌మాల్స్, మెట్రో స్టేషన్లు, కలెక్టరేట్లు, ఇతర ప్రాంతాలు ఇంటరాక్టివ్ క్యూఎస్కే ద్వారా ప్రజలు పౌర సేవలు పొందవచ్చని, దరఖాస్తు నింపడం చెల్లింపులు చేయడం సర్టిఫికెట్ ప్రింట్ తీసుకునే అవకాశాలు కల్పిస్తామన్నారు. మీ సేవలో ప్రభు త్వం కొత్త సర్వీసులు చేర్చిందని, పర్యాటక శాఖ హోటల్స్, పర్యాటక ప్యాకేజీల బుకింగ్, దివ్యాంగుల గుర్తింపు కార్డులు, వయోవృద్ధుల సంక్షేమ కేసుల పర్యవేక్షణ సర్టిఫికెట్ల జారీ, అటవీశాఖకు సంబంధించి వన్యప్రాణుల బాధితులకు సహాయం, కొత్తవి జారీ, వాల్టా చట్టం కింద చెట్ల తొలగింపు, తరలించేందుకు అనుమతులు వంటి సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు.ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మా ట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద అడవిశ్రీరాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేసి ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్, టెలిఫోన్ కనెక్షన్ అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో డీపీవో వీర బుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేం దర్, మంథని ఆర్డీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేలోతు తండాలో చిరుత సంచారం



రైతులు గుర్తించిన చిరుత అడుగులు

వీర్నపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కేలోత్ తండాలో ధరంగుండు చెక్ డ్యాం ప్రాంతంలో చిరుత పులి గిరిజన రైతులకు కనిపించింది. శనివారం కేలోత్ తండాకు చెందిన రైతులు వ్యవసాయ పనులకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో దూరంగా ఉన్న పొలం గట్లపైన చిరుత పులి కనిపించడంతో గిరిజన రైతులు భయభ్రాంతులకు గురై ఇంటికి పరుగులు తీశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు సమాచారం అందించినట్లు రైతులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలి స్తుండడంతో తనిఖీ చేసి వేణు, కుమార స్వామిలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- నానమ్మ మృతి చెందిన మూడు రోజులకే మనుమడు మృతి
- మూడు రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ఇద్దరు మృత్యువాత



రాజమొగిలి(ఫైల్)

వెల్గటూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట గ్రామంలో ఒకే కుటుంబంలో మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి చెందారు. నానమ్మ మృతి చెందిన మూడు రోజులకే మనుమడు మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిట్టల రాజమొగిలి (37) నానమ్మ పిట్టల భూమక్క మూడు రోజుల క్రితం మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఆమెకు ఆదివారం మూడు రోజుల కార్యక్రమం చేయడానికి కిషన్‌రావుపేట శివారులోని శ్మశాన వాటిక వద్దకు వెళ్లారు. అక్కడ కార్యక్రమం అనంతరం వ్యవసాయ బావి వద్ద స్నానాలు చేస్తుండగా రాజమొగిలి తమ్ముడు మల్లేష్, కొడుకు రిశ్వంత్ (13)కు కరెంట్ పైపు నుంచి విద్యుత్ షాక్ తగలడంతో అది చూసిన రాజమొగిలి వెళ్లి వారిని పక్కకు లాగాడు. ఈ క్రమంలో రాజమొగిలి విద్యుదా ఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. వెంటనే రాజమొగిలిని స్థానికులు కరీంనగర్ ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రాజమొగిలి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మల్లేష్, రిశ్వంత్‌లు ప్రాణాలతో బయటపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. రాజమొగిలి భార్య పిట్టల సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. మృతుడు రాజమొగిలి ఇటీవలే అప్పు చేసి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



షమీమ్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ షమీమ్ (46) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక ఆదివారం సిరిసిల్ల మానేరు వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షమీమ్ కుటుంబ పోషణ నిమిత్తం టైలరింగ్ నిర్వహించుకునే వాడు. ఇటీవల తన కుమార్తె వివాహం చేయగా చిన్న కూతురు వివాహం అప్పుల బాధతో ఎలా చేయాలో తోచక మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృత్యువాత



మూగజీవాలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన ముడావత్ భీంరావు అనే మేకల కాపరికి చెందిన మూడు జీవాలు, రెండు శునకాలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. మేకల కాపరి భీంరావును కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. వివరాల్లోకి వెళ్తే భీంరావు ఇంటి పక్కన విద్యుత్ స్తంభానికి ఆనుకుని గొర్రెల షెడ్డును నిర్మించాడు. షెడ్డు చుట్టూ ఇనుప జాలీని ఏర్పాటు చేయగా అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం సింగిల్‌ఫేజ్ 25కెవి డీటీఆర్‌కు ఇనుప జాలీ ఆనడంతో విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో పాకలో ఉన్న మూగజీవాలు, రెండు శునకాలు జాలికి తాకడంతో అక్కడికక్కడే శుక్రవారం మృతి చెందాయి. 80 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న సెస్ ఏఈ పృథ్వీ, లైన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాపరి ఆందోళన చెందవద్దని, సెస్ ద్వారా నష్టపరిహారం అందేలా చూస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. వారి వెంట పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీడీవో మృతి

బుగ్గారం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మాడిశెట్టి శ్రీనివాస్(52) శనివారం రాత్రి కరీంనగర్ లోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఫిబ్రవరిలో జరిగిన బదిలీల్లో ఆయన బుగ్గారం ఎంపీడీవో గా బదిలీ అయ్యారు. విధి నిర్వహణలో నిన్న సాయంత్రం వరకు జగిత్యాలలో తోటి అధికారులతో తన సిబ్బందితో గడిపిన ఆయన గుండెపోటుతో మృతి చెందడంతో తోటి ఉద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం మండల అధ్యక్షుడు వేముల సుభాష్‌తో పాటు బుగ్గారం కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవో అంతక్రియలో పాల్గొని సానుభూతి తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాసుగంటి హను మంతరావు కోరారు. ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లుల సత్వర పరిష్కారం కోసం డిసెంబరు 17న టీపీయూఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ధర్మదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ డీఏలు, పీ ఆర్‌పీ నివేదికను తెప్పించుకుని అమలు చేయాలన్నారు. జీవో 317 ద్వారా నష్టపోయిన ప్రతీ ఉద్యోగికి న్యాయం చేయాలన్నారు. సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేసి వారికి పోస్టింగ్ ఆర్డర్లు వారి స్థానికత ఆధారంగా ఇవ్వాలన్నారు. సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలన్నారు. సమావేశంలో టీపీయూఎస్ రాష్ట్ర కార్య దర్శి రొట్టె శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బండి మహేష్, జిల్లా కార్యదర్శి కాశెట్టి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శీలం రాజేష్, మండల అధ్యక్షులు కాశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కనపర్తి సంతోష్, మండల బాధ్యులు గడిపెల్లి కిరణ్ పాల్గొన్నారు.

నారు మడిలో సస్య రక్షణ

● వరి సాగులో నారు పెంపకం కీలకం

ఇల్లందకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో నారుమడి కీలకం. నారు బాగుంటే అధిక దిగుబడి సాధించవచ్చు. ఈ ఏడాది వర్షాకాలంలో సమృద్ధిగా కురిసిన వర్షాలతో చెరువులు, డ్యామ్‌లు నిండుకుండలా ఉన్నాయి. ప్రస్తుత యాసంగికి పంట వేసేందుకు రైతులు నారుమడులు సిద్ధం చేసి విత్తనాలు అలికారు. డిసెంబరు 15 వరకు నారుమడులు పోసినట్లయితే అధిక దిగుబడి రావడానికి అవకాశాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు.

● నారుమడి పెంపకం..

నారుమడిని బాగాదున్ని రెండుమూడు సార్లు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసి నారు మళ్లను తయారు చేయాలి. రెండు గుంటల నారుమడికి 2కేజీల నత్రజని, 1కేజీ భాస్వరం, 1కేజీ పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడను, ఇతర సేంద్రీయ ఎరువులను దుక్కిలో వేయడం చాలా మంచిది. మొలక కట్టిన విత్తనాన్ని చల్లి, మొదట్లో ఆరుతడులు ఇచ్చి, తర్వాత మొక్క దశలో పలుచగా రెండు మూడు సెంటీమీటర్ల వరకు నీరు ఉంచాలి. జింక్ లోపం సవరణకు లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. మెట్ట నారుమడిలో ఇనుప దాతు గమనిస్తూ సరి చేయాలి. నారుమడి పీకే వారం రోజుల ముందు ఒక గుంట నారుమడికి 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకతో కలిపి చల్లి పలుచగా నీరుంచాలి. అవసరాన్ని బట్టి మడిలో ఇతర సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.



ఇల్లందకుంటలో పోసిన నారుమడి

● ప్రధాన పొలం తయారీ, మొక్కల సాంద్రత...

నాట్లు వేయడానికి 15రోజుల ముందుగానే పొలాన్ని దమ్ము చేయుట ప్రారంభించి రెండు మూడు దఫాలుగా మురగ దమ్ము చేయాలి. నాలుగు నుంచి ఐదు ఆకులున్న నారును నాటుకోవాలి. కొద్దీగా చౌడున్న పొలాల్లో లేత నారు వేయవద్దు. మట్ట ముదురాలి, భూసారాన్ని రకాన్ని బట్టి, కాలాన్ని బట్టి చదరపు మీటర్‌కు కుదుళ్ల సంఖ్య మారుతుంది. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల బాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి అదుపులోకి వస్తుంది. నారు బాగా ముదిరి అలస్యంగా నాటినప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురకు 6-8 మొక్కల చొప్పున నాటు వేయాలి. అలా ముదురు నారు నాటినప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25శాతం పెంచి మూడు దఫాలుగా కాకుండా రెండు దఫాలుగా అంటే 70శాతం నాటే సమయంలో మిగతా 30 శాతం అంకురం దశలో వేయాలి.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

- ముప్పిడి సూర్యనారాయణ, మండల వ్యవసాయాధికారి, ఇల్లందకుంట



రైతులు వరినారు విత్తనాల ఎంపికలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. విత్తన ఎంపికలో మోసపోకుండా దిగుబడి ఎక్కువగా వచ్చే విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. నారుమళ్లు పోసుకోవడానికి డిసెంబరు 15 వరకు అవకాశం ఉంది.



కరీంనగర్ బస్టాండ్ వద్ద మురుగునీటితో నిండిన డ్రైనేజీలు



చెత్తాచెదారంతో నిండిన ప్రయాణ ప్రాంగణం ఆవరణ

అస్తవ్యస్తంగా ప్రయాణ ప్రాంగణం

- దుర్వాసనతో ప్రయాణికుల ఇక్కట్లు
- తాగునీటి ఆర్‌వో పరిసరాల్లో అపరిశుభ్రత
- కుక్కల బెడదతో ఇబ్బందులు

భగత్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రయాణ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. నిత్యం కరీంనగర్ నుంచి హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, గుంటూరుతో పాటు వివిధ ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. కరీంనగర్ బస్టాండ్‌లో మురుగు కాలువలు తీయక పోవడంతో దుర్వాసన వస్తోంది. బస్టాండ్‌లోని హోటల్స్, షాపులు, లాడ్జిల నుంచి వ్యర్థ పదార్థాలు డ్రైనేజీల్లోకి వదులుతుండడంతో భరించలేని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రయాణికులు తెచ్చుకున్న వాటర్ బాటిల్స్, తినుబండా రాల ప్యాకెట్లు, కవర్లు ఫ్లాట్ ఫాంలపై పడవేస్తున్నారు. బస్టాండ్‌ను ప్రతి రోజూ శుభ్రపరిచే శానిటేషన్ సిబ్బంది లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. మంచినీటి ఆర్‌వోల పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం నిండి ఉండడంతో ప్రయాణికులు తాగేందుకు జంకుతున్నారు.



బస్సులు బయటికి వెళ్లే మార్గం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు

● ట్రాఫిక్ అస్తవ్యస్తం

కరీంనగర్ ప్రయాణ ప్రాంగణం ముఖ ద్వారంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. కార్లు, ద్విచక్ర వాహనాలు బస్టాండ్‌లోకి వస్తుండడంతో బస్సులు ఎక్కేందుకు వెళ్తున్న ప్రయాణికులతో పాటు, దిగి వెళ్తున్న ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. బస్టాండ్ ఫ్లాట్ ఫాంలపైనే పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతుండడంతో ప్రయాణికులు భయభ్రాం తులకు లోనవుతున్నారు. ఫ్లాట్‌ఫాంల వద్ద ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీల కింద నిత్యం కుక్కలు పడుకుంటుండడంతో కూర్చునే పరిస్థితి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పరిశుభ్రంగా ఉంచే విదంగా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక



ఇల్లంతకుంట విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్

ఇల్లంతకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిద పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపికయ్యారు. గాలిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అమిత అనే విద్యార్థిని గైడ్ టీచర్ యాద రవి సహకారంతో ఫోల్డేబుల్ ఛైర్ రూపొందించి పలువురి ప్రశంసలు అందుకుంది. రోడ్డు ప్రక్కన పూలు, పండ్లు కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు అకస్మాత్తుగా కురిసే వర్షాలతో ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనిని గమనించిన అమిత సరకులను తొందరగా సర్దుకోవడానికి వీలుండే విదంగా ఫోల్డేబుల్ ఛైర్‌ను రూపొందించింది. ఇల్లంతకుంటలోని జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుతన్న ఒడ్నాల రేష్మ అనే విద్యార్థిని గైడ్ టీచర్ మహేష్‌చంద్ర సహకారంతో ఉమెన్ ఆయిట్ అనే ఎగ్జిబిట్‌ను ప్రదర్శించింది. ఇదే పాఠశాలలో చదువుతున్న పడిగె భవిత్ అనే విద్యార్థి గైడ్‌టీచర్ మధుసూదన్‌రావు సహకారంతో రైతు స్నేహపూర్వక సాధనం అనే ప్రాజెక్టును రూపొందించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇల్లంతకుంటలోని కేరళ మోడల్ స్కూల్‌లో చదువుతున్న ఆర్లీన్ అనే విద్యార్థి గైడ్‌టీచర్ బాలకృష్ణ సహకారంతో పరిశ్రమల వ్యర్థాల ఉద్గారాల శుభ్రత అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



అమిత తయారు చేసిన ప్రాజెక్టు

పోగొట్టుకున్న ఫోన్ భక్తుడికి అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఆలయ ఉద్యోగి

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో బస్‌స్టేషన్ సమీపంలో గల శ్రీ లక్ష్మీనరసింహసదన్ ధర్మశాలలో ఒక భక్తుడు పోగొట్టుకున్న సెల్ ఫోన్ దొరికిన ఆలయ ఉద్యోగి, ఇన్‌చార్జి వంశీకృష్ణ ఆదివారం ఆయనకు అప్పగించాడు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన భక్తుడు దైవ దర్శనానికి వచ్చి బస్‌స్టేషన్ సమీపంలో గల లక్ష్మీనరసింహసదన్‌లో బస చేశాడు. ఉదయం తనకు సంబంధించిన 17 వేల రూపాయలు విలువ గల సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆ ఫోన్ దొరికిన ఆలయ ఉద్యోగి, ఇన్‌చార్జి వంశీకృష్ణ వెంటనే ఈవో సంకటాల శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. ఈ మేరకు భక్తుడికి కౌంటర్ వద్దకు పిలిపించి అప్పగించారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల ఆవరణ



మందుబాబులు తాగి పడేసిన సీసాలు

కొడిమ్యాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న మండలంలోని పూడూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డగా మారింది. పాఠశాలకు గతంలో నిర్మించిన ప్రహరీగోడను కొంత భాగం గతంలో గుర్తు తెలియని వ్యక్తులు కూలగొట్టారు. దీంతో అక్కడి నుంచి రాత్రి సమయంలో పలువురు వచ్చి పాఠశాల ఆవరణలో మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో బీరు సీసాలు పగులకొడుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు కొనసాగుతున్నాయి. ప్రహరీ గోడ సరిగా లేకపోవడంతో ఏడాది క్రితం అధికారులు ఏర్పాటు చేసిన సోలార్ లైట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారని ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సంబంధిత అధికారులు పట్టించుకొని ప్రహరీ నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



ధర్మపురిలో స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

భక్తజన సంద్రమైన మల్లన్న జాతర



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

గొల్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతర భక్తజన సంద్రమైంది. ఉత్సవాల్లో భాగంగా మొదటి ఆదివారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని, బంతిపూలు మెడలో ధరించి ఒగ్గు పూజారుల ఢమరుకనాదాల నడమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘు వేదమంత్రోచ్ఛ రణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి రూ. 72010 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. జాతరలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఉత్సవాలను ఏఎంసీ ఛైర్మన్ భీమ సంతోష్ పర్యవేక్షించారు.

- వర్షంతో భక్తుల ఇక్కట్లు..

ఆదివారం జరిగిన జాతర ఉత్సవాల సందర్భంగా మల్లన్న పేటలో అకగంట పాటు ఓ మోస్తరు అకాల వర్షం కురిసింది. దీంతో భక్తులు ఇక్కట్ల పాలయ్యారు. ఆలయ పరిసర ప్రదేశాలతో పాటు ఆలయం నలుదిక్కుల పంటపొలాల్లో, ఆరుబయట భక్తులు బస చేయ డంతో అకాల వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉత్సవాలకు తల్లిదండ్రులతో కలిసి వచ్చిన ఆకుల హిమాన్షు అనే రెండేళ్ల బాలుడు జాతరలో తప్పిపోయాడు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ బాలుడిని వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించాడు.

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో ఆదివారం మల్లన్న భక్తులు స్నానాలు ఆచరించారు. భక్తులు తలపై మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని త్రిశూలం చేత పట్టుకుని ధర్మపురి క్షేత్రానికి తరలివచ్చారు. అనంతరం భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇసుక లింగాల వద్ద ఉంచి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని భక్తి పాటలు పాడుతూ భక్తులు విగ్రహాల పెట్టెలతో తిరుగు ప్రయాణం చేశారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్ర గాయాలు

కోరుట్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగినిపల్లి గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న తేలు మణి అనే విద్యార్థికి విద్యుత్ షాక్ తగిలి తీవ్రగాయాల పాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. తేలు మణి తన స్నేహితులతో కలిసి గ్రామంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేసుకున్నారు. సమీపంలో ఉన్న విద్యుత్ సంభం నుంచి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం తన స్నేహితులతో షటిల్ ఆడుతుండగా ప్రమాదవశాత్తూ మణికి విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే మణిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు చెప్పడంతో హైదరాబాదు తరలించారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం భక్తులు తెల్లవారు జామున ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని, ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం కోసం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులు కోడెమొక్కు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజ చేశారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా పోచమ్మ బోనాలు



అనంతారంలో బోనాలు నిర్వహిస్తున్న మహిళలు

ఇల్లంతకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామంలో ఆదివారం ఘనంగా పోచమ్మ బోణాలు నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయిని ఏర్పాటు చేసి సంవత్సరం కావడంతో బోనాలు నిర్వహించారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను కేంద్రం వెంటనే రద్దు చేయాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కోరుట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీనారే భవనంలో నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలో రాష్ట్ర నాయకులు భాలకృష్ణ, శ్రీకాంత్, సుందర్‌లతో కలిసి పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా పట్టణంలోని జాతీయ రహదారిపై సీపీఎం నాయకులు కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. మొదట సినారే భవనంలో అమరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లాతో పాటు వివిధ జిల్లాలో ప్రజా సమస్యలను గుర్తించి చేయాల్సిన నిరసనలపై చర్చించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మతాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విధానాలను మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తిరుపతి నాయక్, ఎంఏ చౌదరి, ఇందూరి సులోచన, నాయిని శారధ, భగత్, భూషణ్, రమేష్, మల్యాల సురేష్, పద్మ, లక వత్ మహిపాల్ నాయక్, రజియా సుల్తానా, కొంచం శంకర్, గుమ్మడి రమేష్, ఎల్ల పోశయ్య తదితరులు మాట్లాడారు.

చరిత్రకు సాక్ష్యం.. రాయికల్ త్రికూటాలయం

- తగిన ఆదరణ లేక కనుమరుగు
- అభివృద్ధి చేయాలని భక్తుల డిమాండ్

రాయికల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన త్రికూటాలయం తగిన గుర్తింపు లేక ఆలయ చరిత్ర కనుమరుగవుతోంది. గతంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినా పూర్తి స్థాయిలో వాటిని వినియోగించలేదు.



రాయికల్‌లోని త్రికూటాలయం

● ఆలయ చరిత్ర

క్రీ.శ.1305లో కాకతీయ రాజుల పరిపాలనలో చెన్న కేశవనాథ త్రికూటాలయం నిర్మితమైంది. సుమారు ఏడు వందల ఏళ్ల క్రితం రాయికల్‌లో నిర్మించిన ఈ ఆలయంతోనే రాయికల్ చరిత్ర ముడిపడి ఉంది. ఆలయంలో ఉన్న పంచముఖ లింగం ఎంతో విశిష్టమైంది. ఈ ఆలయంలో సూర్యనారాయణ స్వామి, పంచముఖ లింగం, వేంకటేశ్వరస్వామి ముగ్గురూ ఒకే చోట కొలువు దీరడంతో ఆలయానికి త్రికూటాలయం అని పేరు వచ్చింది. ఆలయ అభివృద్ధికి ఏఎస్ఎల్ పార్సిల్ ఎండీ సీహెచ్ఎస్‌వి కృష్ణారావు నివేదితా దంపతులు, పట్టణ ప్రజల సహకారంతో ఆలయంలో విగ్రహాల పునప్రతిష్ఠ చేసి ఆలయ ప్రాంగణంలోనే నూతనంగా వినాయక ఆలయం నిర్మించి కొంతవరకు ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. ప్రభుత్వం నుం చి నిధులు లేకపోవడంతో ఆలయం పూ ర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడంలేదు.

● అభివృద్ధికి నిధులు కరువు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించినప్పటికీ ఆలయ మరమ్మతులకు నిధులు లేకపోవడంతో పాటు ఆలయ చరిత్రను కాపాడేవారే కరువయ్యారు. పట్టణంలోని పలువురు నాయకులు ఆలయ విశిష్టత కాపాడుతూ పలు ఉత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు లేకపోవడంతో ఆలయ అభివృద్ధి జరగడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆలయంలోని పంచముఖ లింగం

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- ఏనుగు మల్లారెడ్డి, రాయికల్



ఏళ్ల చరిత్ర కలిగిన చెన్నకేశవనాథ ఆలయానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి. అత్యంత పురాతన పంచముఖ లింగం అరుదుగా ఉండే ఆలయాల్లో కేశవనాథ ఆలయం ఒకటి. ఆలయ చరిత్రను కాపాడి అభివృద్ధి చేయాలి. పర్యాటక ప్రాంతంగా గుర్తించి నిధులు మంజూరు చేయాలి.

పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి

- తుమ్మల సదాశివరెడ్డి(నాని), రాయికల్.



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చెన్నకేశవనాథ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా చూపించారు. నూతన జిల్లాలోనూ పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి. ఆలయ ప్రాంగణంలో గదులు నిర్మించి అభివృద్ధికి నిధులు విడుదల చేసి ఆలయ చరిత్రను కాపాడాలి.

న్యూస్ బాక్స్

క్రీడా స్ఫూర్తిని చాటాలి..

ఓదెల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి క్రీడాకారుడు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని వివిధ స్థాయిల్లో క్రీడా స్ఫూర్తిని చాటాలని సింగిల్ విండో ఛైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొత్కపల్లి హైస్కూల్లో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి కప్ 2024 గ్రామీణ స్థాయి క్రీడా పోటీలను సింగిల్ విండో ఛైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మౌనిక ప్రారంభించారు. సందర్భంగా సుమన్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణస్థాయి క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ హరికృష్ణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను తొలగించాలి

కోల్‌సిటీటౌన్,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోని కార్పొరేట్ పాఠశాలకు చెందిన ప్రిన్సిపల్‌ని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సమావేశంలో ప్రీతం మాట్లాడారు. ప్రిన్సిపల్ విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో, అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తోటి ఉపాధ్యాయురాలులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. అయినా పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపాల్‌ను తొలగించకుండా ప్రోత్సహిస్తుందన్నారు. ప్రిన్సిపల్‌ను తొలగించకపోతే విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్, గొడిసెల ప్రణీత్, గాజుల వినయ్, వంశీ, అరవింద్, సిద్దు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా చంద్రయ్య

పాలకుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా కడారి చంద్రయ్య ఎన్నికయ్యారు. ఆదివారం మండలంలోని ఈసాలతక్కళ్లపల్లిలో జరిగిన ఎన్నికల్లో చంద్రయ్య గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా పన్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పన్నాల లక్ష్మణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎలిగేడు, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెండున్నర దశాబ్దాల తర్వాత పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చొరవతో పోలీస్ స్టేషన్ ఏర్పడడం హర్షనీయంగా కాంగ్రెస్ నాయకులు, ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి సతీష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన శివపల్లిలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

బాధితుడిని పరామర్శించిన గౌడ సంఘం నాయకులు

పాలకుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని కొత్తపల్లికి చెందిన తోట శంకర్‌గౌడ్ ఈత చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో పెద్దపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఆదివారం సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పడాల కొమురయ్య పరామర్శించారు. బాధితుడికి ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా వచ్చేలా చర్యలు తీసుకోవాలని అబ్కారీ శాఖ సీఐతో ఫోన్లో మాట్లాడారు. కార్యక్రమంలో గోపా అధ్యక్షుడు బాలసాని వెంకటేశంగౌడ్, డాక్టర్ స్వరూప్ కిరణ్‌గౌడ్, డాక్టర్ ప్రణీత్ గౌడ్, జిల్లా సహాయకార్యదర్శి పొన్నం సత్తయ్యగౌడ్,కొండాల్‌గౌడ్ ఉన్నారు.

అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు

- నిర్లక్ష్యం నీడలో చెత్త వేరుచేసే కేంద్రాలు.. - పట్టించుకునే వారు కరువు - నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం..



లాలపల్లి గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్డు



సెగ్రిగేషన్ షెడ్డు చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎలిగేడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన తడి, పొడి చెత్తవేరు చేసే సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. పట్టించుకునే నాథుడే కరువై నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతున్నాయి. 2021-22లో జాతీయ ఉపాధిహామీ పథకం కింద ఎలిగేడు మండలంలోని 12గ్రామాల్లో తడి,పొడి చెత్తవేరు చేసే షెడ్ల నిర్మాణానికి ఒక్కొక్క దానికి రూ.2,21,577 వెచ్చించి నిర్మించారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను ఒకే చోటికి తరలించి తడి,పొడి చెత్తను రెండు విభాగాలుగా విభజించి సేంద్రియ ఎరువులుగా తయారుచేసి రైతులకు అందించాలనే ఆశయంతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా షెడ్డులో ప్లాస్టిక్, ఐరన్, గాజు, పేపర్లు, చెప్పులు, బ్యాగులు వంటి వస్తువులను నిలువచేసేందుకు విడివిడిగా గదులను ఏర్పాటు చేశారు. షెడ్లు నిర్మించి నాలుగేళ్లు కావస్తున్నా వాటిని ఉపయోగించుకున్న దాఖలాలు లేవు. ఆయా కేంద్రాల ద్వారా ఏ ఒక్క రైతుకు సేంద్రియ ఎరువులను అందించిన వారులేరు. రైతుల ప్రయోజనాల కోసం నిర్మించిన వీటిపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి..



- జల్లి రమేష్, ముప్పిరితోట

రాష్ట్ర ప్రభుత్వం గొప్ప ఆశయంతో ఏర్పాటు చేసిన తడి,పొడి చెత్తవేరుచేయు కేంద్రాలను వినియోగంలోకి తేవాలి. ఈ కేంద్రాల వద్ద చెత్తను నిర్లక్ష్యంగా పడివేయకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

సేంద్రియ ఎరువులను అందించాలి..



- బడే శంకర్, రైతు, ఎలిగేడు

తడి, పొడి చెత్త వేరు చేసే కేంద్రాల్లో తయారుచేసిన సేంద్రియ ఎరువులను రైతులకు అందించి పంట అధిక దిగుబడులకు దోహదపడాలి. తద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

మావోయిస్టులకు పెట్టని కోట 'రాణాపూర్'

- నాడు బయ్యపు దేవేందర్‌రెడ్డి.. నేడు ఏగోలపు మల్లయ్య మృతి.. - విప్లవోద్యమంలో ముగిసిన రాణాపూర్ ప్రస్థానం

పాలకుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండలంలోని రాణాపూర్ గ్రామం ఒకప్పుడు మావోయిస్టులకు పెట్టని కోటగా ఉండేది. అప్పటి సామాజిక పరిస్థితుల నేపథ్యంలో కొండపల్లి సీతారామయ్య ఇచ్చిన పిలుపుతో జమ్మికుంట ఆదర్శ డిగ్రీ కాలేజీలో విద్యనభ్యసిస్తున్న రాణాపూర్ గ్రామానికి చెందిన బయ్యపు దేవేందర్‌రెడ్డి గ్రామాల్లో తిరుగుతూ రాడికల్ విద్యార్థి సంఘాలను, రైతు కూలీ సంఘాలను నిర్మించాడు. ఈక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న దేవేందర్‌రెడ్డి బొట్లవనపర్తి(ప్రస్తుత ధర్మారం మండలం) గ్రామంలో జరిగిన పోలీసు కాల్పుల్లో మృతిచెందాడు. దేవేందర్‌రెడ్డి స్మృతికి చిహ్నంగా రాణాపూర్‌లో స్థూపం నిర్మించి ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. కొద్దిరోజుల తర్వాత స్థూపాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బయ్యపు దేవేందర్‌రెడ్డి స్ఫూర్తితో పలువురు గ్రామస్థులు పీపుల్స్‌వార్‌లో చేరారు. అనంతరం కొందరు ప్రభుత్వానికి లొంగిపోగా, మడిపెల్లి కనుకన్న, బోడాసు సదానందం, మేకల భూమయ్య, మడిపెల్లి నర్సయ్య, ఆరుముళ్ల శంకర్, మడిపెల్లి కనుకమ్మలు వేరువేరు ప్రాంతాల్లో జరిగిన పోలీస్ ఎదురుకాల్పుల్లో మృతిచెందారు. అదే గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు ములుగు జిల్లా ఏటురునాగారం మండలం చల్పాక అటవీప్రాంతంలో ఈనెల 1వ తేదిన జరిగిన పోలీస్ ఎదురుకాల్పుల్లో మృతిచెందాడు. మల్లయ్య అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో జరిగాయి. మావోయిస్టు ఉద్యమంలో నాడు బయ్యపు దేవేందర్‌రెడ్డితో మొదలైన 'రాణాపూర్' ప్రస్థానం నేడు ఏగోలపు మల్లయ్య మృతితో ముగిసినట్లైందని ఈప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు.



రాణాపూర్ గ్రామం

'రేషన్' మాఫియా..

(5వ పేజీ తరువాయి)

టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండున్నర టన్నుల బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ కేసుల్లో కూడా స్మగ్లర్ల పేర్లు లేవు. సాధారణంగా 1వ తేది నుంచి 10తేది వరకే వెయ్యి నుంచి 1500టన్నుల బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది.

● హెచ్చరికలు మామూలే..

రేషన్ అక్రమ రవాణా దారులపై పీడీ యాక్టులు పెడతామని కమిషనరేట్ నుంచి వస్తున్న హెచ్చరికలు మామూలయ్యాయి. జాబితా సిద్ధం చేస్తున్నామని చెబుతున్నా అసలు ఠాణాల్లో స్మగ్లర్లపై కేసులే లేవని పోలీస్ వర్గాలే పేర్కొంటున్నాయి. దీంతో పోలీసుల హెచ్చరికలు సాంప్రదాయంగానే మారాయి. గతంలో రామగుండం కమిషనరేట్‌లో నలుగురు రేషన్ స్మగ్లర్లపై పీడీ యాక్టులు నమోదు అయ్యాయి. ఇప్పుడు కేసులు నమోదయ్యే పరిస్థితే లేదు.

విగ్రహం రూపురేఖలు మార్చడం సరికాదు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మార్చడం సరికాదని మాజీ ఎంపీపీ బీఆర్‌ఎస్ నాయకుడు నూనేటి సంపత్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూనేటి సంపత్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి మొదలు ఎందరో మేధావులు తెలంగాణకు చిహ్నంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చడాన్ని కాల్వశ్రీరాంపూర్ బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుల నిదర్శనమని, తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో బతుకమ్మను తీసివేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం మొదలైందన్నారు. తెలంగాణ తల్లి చేయి హస్తం గుర్తు చూపిస్తుందని తెలంగాణ విగ్రహం మార్పుపై కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఆవిష్కరణ విరమించుకోవాలని గతంలో ఉన్న మాదిరిగానే తెలంగాణతల్లి విగ్రహాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, నాయకులు పుప్పాల నాగార్జునరావు, కొట్టె రవీందర్, బండ రవీందర్‌రెడ్డి, బుర్ర సదానందం, నిదానపురం దేవయ్య, ఆకుల వివేకస్వామిపటేల్, జెట్టి దేవయ్య, జంగ శ్రీనివాస్‌రెడ్డి, కామెడీ వెంకట్‌రెడ్డి, బోయిని సదానందం, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ స్కూల్ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న సిరిపురం సత్యనారాయణ

ధర్మారం, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : ఈటి టెక్ నిర్వహించిన సర్వేలో తెలంగాణలోని టాప్ 20 స్టేట్‌బోర్డ్ స్కూల్స్‌లో ధర్మారం మండలానికి చెందిన బ్రిలియంట్ స్కూల్‌కు గుర్తింపు లభించింది. శనివారం హైదారాబాద్‌లోని హైటెక్స్‌లో ఈటి టెక్ వారు నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్రిలియంట్ స్కూల్ అధినేత సిరిపురం సత్యనారాయణ బెస్ట్ స్కూల్ అవార్డును అందుకున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న స్కూల్ తెలంగాణలోని టాప్ 20 స్టేట్‌బోర్డ్ స్కూల్స్‌లో ఒకటిగా నిలవడం ఆనందంగా ఉందని సత్యనారాయణ అన్నారు. గత 30 సంవత్సరాలుగా విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల కృషి, పేరెంట్స్ తోడ్పాటుతోనే తమ కష్టానికి ఫలితం లభించిదని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

సీఎంను కలిసిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అవినాష్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్, ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా బొంకూరి అవినాష్ భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆదివారం హైదారాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినాష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం పని చేసిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అవినాష్ కృతజ్ఞతలు తెలిపి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



సీఎంను కలిసిన బొంకూరి అవినాష్

పందిళ్లలో ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పందిళ్లలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి, ముదిరాజ్, జంపన్న, పోతలింగన్న విగ్రహాల ప్రతిష్ఠాపన పూర్తయిన సందర్భంగా ఆదివారం ముదిరాజ్ కులస్థులు ఘనంగా పెద్దమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల, శివశక్తుల నృత్యాల మధ్య పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పిల్లాపాపలను చల్లగా చూడాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సక్రమంగా పండాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని పెద్దమ్మతల్లిని వేడుకున్నట్లు పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు మత్స్య పారిశ్రామిక శాఖ సొసైటీ అధ్యక్షుడు దాసరి మల్లేష్, ఉపాధ్యక్షుడు కందుల మల్లేష్, కార్యదర్శి బండి రవి, సభ్యులు పోతరవేన మహేష్, పోతరవేన లక్ష్మణ్, పోతరవేన సుధాకర్, పోతరవేన కొమురయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాఘవపూర్‌లో పోచమ్మ బోనాలు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎల్లమ్మ పట్నాలలో భాగంగా పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనమెత్తుకొని డప్పుచప్పుళ్ల నడుమ ఆలయానికి చేరుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు దూలం సతీష్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, బాలసాని పరశురాములు తోపాటు పెద్ద సంఖ్యలో గౌడ కులస్థులు పాల్గొన్నారు.



బోనాలతో తరలివెళుతున్న ముదిరాజు కులస్థులు

ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం సీపీఐకే ఉంది..

- జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

ఓదెల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాల్లో గాని చట్టసభల్లో, గ్రామాలల్లోగాని నిలదీసే ధైర్యం సీపీఐ నాయకులకే ఉంటుందని పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. ఈనెల 26న సీపీఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆది వారం ఓదెలలో జిల్లా కార్యదర్శి సభ్యత్వాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో సదానందం మాట్లాడుతూ వందేళ్ల ఘన చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ కార్మిక, కర్షక, ప్రజల పక్షాన పోరాడిందని తెలిపారు. ఈనెల 26 నాటికి సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రణాళికల రూపొందించినట్లు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కోడం స్వామి, నాయకులు ఆళ్ల చిన్న శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పల్లె గట్టయ్య, మండల మాజీ కార్యదర్శి రంగు శంకర్ గౌడ్, తుమ్మల సదయ్య, సమ్మెట నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో డిపార్ట్‌మెంటల్ పరీక్ష

రామగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంటల్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పరీక్షలో 140 మందికి 39 మంది గైర్హాజరు కాగా, 101 మంది అభ్యర్థులు హాజరైనట్లు ప్రిన్స్‌పాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 140 మందికి 112 మంది హాజరుకాగా 28 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. డిపార్టమెంటల్ పరీక్షకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



డిస్పెన్సరీలో వసతులను పరిశీలించిన జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 డిస్పెన్సరీని ఆదివారం ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య సందర్శించారు. రోజు డిస్పెన్సరీకి వచ్చే రోగుల వివరాలు, డిస్పెన్సరీలో వసతులు, మందుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. వైద్యం కోసం డిస్పెన్సరీకి వచ్చే ఉద్యోగులు, వారి కుటుంబీకులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని, అత్యవసర పరిస్థితి ఉన్న కేసుల్లో ప్రథమ చికిత్స చేయడం, ఏరియా ఆసుపత్రికి తరలించడంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి జీఎం సూచించారు. జీఎంగా మొదటిసారి డిస్పెన్సరీకి వచ్చిన వెంకటయ్యను వైద్య సిబ్బంది శాలువాతో సన్మానించారు. జీఎం వెంట ఎస్వోటూ జీఎం రాముడు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్ ఉన్నారు.

పెద్దపల్లి, సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్లకు గుర్తింపు



సర్టిఫికెట్లను అందుకున్న పెద్దపల్లి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



సర్టిఫికెట్ అందుకుంటున్న సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పెద్దపల్లి కల్చరల్, సుల్తానాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల వాకర్స్ అసోసియేషన్, సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్‌ను తమకు అనుబంధంగా గుర్తిస్తూ వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 303 వారు సర్టిఫికెట్ అందించారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జోనల్ గవర్నర్ ఎల్లాగౌడ్ చేతుల మీదుగా అధ్యక్షులు తిర్రి తిరుపతి, జెక్కి శ్రీనివాస్ గౌడ్‌కు, సుల్తానాబాద్ వాకర్స్ అసోసియోషన్ అధ్యక్షుడు భైరగోని రవీందర్ గౌడ్‌కు గుర్తింపు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రావు, బుర్ర జగదీశ్వర్‌గౌడ్ రవీందర్, రమణారెడ్డి, రాజు, వెంకటరెడ్డి, కిషన్‌రావు, రవీందర్ రెడ్డి, కన్నం శ్రీనివాస్, తిరుపతి, శ్రీనివాస్ గౌడ్, సుమన్, పర్శరాములు,రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు..

- ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్..

- బీఆర్‌ఎస్ నాయకుడు మారుతి

గోదావరిఖని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు జరిగాయని, తాము ఇచ్చామంటూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకుడు నారాయణదాసు మారుతి విమర్శించారు. ఆదివారం గోదావరిఖని చౌరస్తాలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రామగుండం ఎమ్మెల్యే సారథ్యంలోనే 660 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేయడం జరిగిందని, అప్పుడు డ్రా కూడా తీశారని, అక్కడ మౌలిక సదుపాయలు రోడ్లు, డ్రైనేజీల కోసం పనులు ఆలస్యమయ్యాయని, ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయని, ఇండ్లు తామే ఇచ్చామంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, రామగుండం మాజీ ఎమ్మెల్యేను కాంగ్రెస్ నాయకులు అవహేళన చేయడం సరైంది కాదని, గెలిచి ఏడాది అయినా ఇక్కడ ఏ పనులు కావడం లేదని, ఎన్నికోట్లు వచ్చాయో ప్రజలకు చెప్పడం లేదని, తట్టెడు మట్టి పోసిన దాఖలాలు కూడా లేవని విమర్శించారు. రామగుండం ప్రజలను భ్రమలో పెట్టి కాంగ్రెస్ నాయకులు ఆర్భాటాలు చేస్తున్నారే తప్ప చేసిందేమి లేదని, గతంలో చందర్ తీసుకువచ్చిన నిధులతోనే ఇప్పుడు పనులు చేస్తున్నారని, పదేళ్ల ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని ఆయన చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు పర్లపల్లి రవి, సట్టు శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావణ్, నీరటి శ్రీనివాస్, ముర్రి వెంకన్న, రామరాజు, ఓదెలు, తోకల రమేష్, పద్మ, ఐలయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ..

ముత్తారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖైదబండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మచ్చ అజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి మంజూరైన చెక్కును మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆదేశాల మేరకు అజయ్ ఇంటికి వెళ్లి రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు మంథని మాజీ ఎమ్మెల్యే మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పుట్ట మధు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న పుట్ట మధు

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ఓదెల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొత్కపల్లి గ్రామపంచాయతీ వద్ద ఆదివారం సింగిల్‌విండో ఛైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, ఆధ్వర్యంలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పూదరి దత్తగౌడ్, ఓదెల మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ సహకారంతో నిర్వహించిన కంటి వైద్య పరీక్షలకు మంచి స్పందన లభించింది. ఈ శిబిరానికి 180 మంది గ్రామస్తులు హాజరుకాగా 57 మందికి కంటిలో పొరలు ఉన్నట్లు నిర్ధారించారు. వీరందరికీ వారంరోజుల్లో చల్మెడ ఆనందారావు ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని, అలాగే ఉచిత భోజన, రవాణా సౌకర్యాలను ఏర్పాట్లు చేసినట్లు సుమన్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో కంటి ఆపరేషన్లు కానీ, అలాగే కంటిలో పొరలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సుమన్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ పూదరి దత్తగౌడ్, మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్, లగిశెట్టి వంశీ, గీతాంజలి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పల్కపాటి రాజేష్ కుమార్, అంబాల కొమరయ్య, రెడ్డి రజినీకాంత్, వంగ శ్రీనివాస్, రామినేని నాగరాజు, ఆళ్ల రమణారెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.